# నిధి

మూలం : ఆల్బర్టో మొరేవియా
అనువాదం : తోలేటి జగన్మోహనరావు

అప్పుడు నేను పోర్టా శాన్ పేంక్రాజియో అవతల వున్న ఒక హోటల్లో వెయిటరుగా పనిచేస్తుండేవాడిని. కూరగాయలు పెంచే ఒక ముసిలాడు రోజూ మా హోటలుకి వస్తుండేవాడు. వాణ్ణి అందరూ మారినిస్ అని పిలిచేవారు. వాడు మారినో నుంచి వచ్చినవాడవడం వలనో లేదా వాడస్తమానూ మారినో సారా తాగేవాడు కనుకనో అందరూ వాణ్ణి మారినిస్ అని పిలిచేవారు. వాడెంత ముసిలాడంటే వాడి వయసెంతో వాడికే తెలియదు.కాని ముసిలాడు మాత్రం కుర్రాళ్ళకంటె ఎక్కువే పట్టించేశేవాడు. మందు కొడుతూ ఎదురుగా ఎవడుంటే వాడితో వాగడం మొదలుపెట్టేవాడు. ఎవరూ దొరక్కపోతే తనలో తనే మాట్లాడుకునేవాడు. పనేవీ లేకపోతే హోటలుకి వచ్చేవాళ్ళ మాటలు వింటూ కాలం వెళ్ళబుచ్చటం మా వెయిటర్ల అలవాటు. మారినిస్ గాలిపోగుచేసి కథలల్లి చెబుతుండేవాడు. వాడు చెప్పే కథల్లో కొద్దిగా నిజం ఉంది అనిపించే కథ ఒకటుంది. తాగి ఉన్నప్పుడు వాడో కథ చెబుతుండేవాడు. జర్మన్లు ఎవరోయువరాజు కోట నుంచి వెండి దొంగిలించి ఎక్కడో పాతిపెట్టారని, వాళ్ళెక్కడ పాతిపెట్టిందీ తనకు తెలుసుననీ వాగుతుండేవాడు. మరీడోసు ఎక్కువైతే ఆ పాతిపెట్టింది తన తోటలోనే అని చెప్పేవాడు.

'కావాలంటే నేను లక్షాధి కారినై పోగలను' అంటాడు.

'ఎప్పుడూ' - ఎవరో ఒకసారి వాడిని అడిగారు.

'నేను ముసిలాడినైపోయి ఇక విశ్రాంతి కావాలనుకున్నప్పుడు', అన్నాడు మారినిస్

వాడికి అప్పటికే కనీసం ఎనభై ఏళ్ళయినా ఉంటాయి. వాడు వేళాకోళమాడుతున్నాడో, నిజం చెబుతున్నాడో తెలిసేది కాదు.

ఈ నిధిని గురించి ఆలోచించగా, ఆలోచించగా, చివరకు ఆ కథ నిజమనే నమ్మకం కుదిరింది. ఎందుకంటే, కొన్ని సంవత్సరాల క్రితం, జర్మను ఆక్రమణ సమయంలో అటువంటి దొంగతనం జరిగింది. యువరాజుకి వెండి తిరిగి దొరకలేదు. ఆలోచించిన కొలదీ ముసిలాడి మీద మంటపుట్టుకొచ్చింది. వాడు ఎప్పుడో ఎవరికీ చెప్పా పెట్టకుండా బాల్చీ తన్నేస్తాడు. వాడితో పాటు నిధి రహస్యం కూడా సమాధి



లోకి పోతుంది. వాడిని మంచి చేసుకోవడానికి ప్రయత్నించాను. వాడికి పోసే సారా అంతా పట్టేసేవాడు కాని నోరు మాత్రం విప్పేవాడు కాదు.

'నువ్వు నాకొడుకువైనా సరే - నీకు చెప్పనురోయ్ - నీకేం దున్నపోతులా ఉన్నావు - పనిచేసుకుని బతకగలవులే - పని చేసుకోలేని ముసిలాళ్ళకు డబ్బు కావాలి కాని నీకెందుకురా - తాగినంతా తాగి చివరకు వాడు తేల్చినది ఇది.


వీడితో ఇలా లాభంలేదని మరో వెయిటరుతో ఈ రహస్యం చెప్పాను. వాడిపేరు రెమీగియో. తెల్లగా పాలిపోయినట్లుంటాడు. నాకంటే చిన్నవాడు. నిధిగురించి చెప్పగానే వాడు ఎగిరి గంతేశాడు. వాడు అప్పుడే కలలు కనెయ్యడం మొదలు పెట్టాడు - 'మనకి బోల్డంత డబ్బు వస్తుంది - నేను ఓ మోటారు సైకిలు కొనుక్కుంటా - మనిద్దరం కలిసి ఒక బార్ ప్రారంభిద్దాం, అన్నాడు వాడు.

వాణ్ణి నేలమీదకు దింపి చెయ్యవలసిం దేదిటో చెప్పాను - 'మొదట మనం నిధి ఎక్కడుందో తెలుసుకోవాలి - అప్పుడే గాలిమేడలు కట్టెయ్యకు - నిధిలో మూడువాటాలు నావి - ఒక వాటా నీది - ఇష్టమేనా ?'

వాడు ఆనందంతో పొంగిపోతూ సరే అన్నాను.

ఆరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత వయా అరులియా దగ్గర ఇద్దరం కలుసుకున్నాం. మేనెల ఆకాశంలో నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. పుచ్చపువ్వు లాంటి వెన్నెలలో పరిసరాలన్నీ వెలుగుతూ పట్టపగలులా ఉంది. హాయిగా చల్లగాలి వీస్తోంది. ఇలాంటి హుషారైన సమయంలో ముసిలాడి పీక నొక్కెయ్యడం నాకేమీ తప్పనిపించలేదు. అదేదో తమాషా అనిపించింది. వయా అరులియా నుంచి పురాతనమైన గోడల వెంబడి నడవడం మొదలుపెట్టాం. ఆగోడల వెనకాల కూర గాయల తోటలున్నాయి.

ముసిలాడు సహాయనిరాకరణచేసి వాడి పార ఇవ్వనంటాడేమోనని నేను పారతీసు కొచ్చాను. రెమీగియోగాడికి ఇంకో పార ఇచ్చాను- వాడికి కూడా కొంత పని అంటగట్టాలి గదా ! ఎందుకైనా మంచిదని పిజ్జా విట్టోరియోలో ఒక రివాల్వరు, గుళ్ళు కొన్నాను. నిజం చెప్పాలంటే నిధి గురించి నేనూ కలల్లో తేలిపోతున్నాను.




రెమీగియోగాడికి ఈ విషయం చెప్పినందుకు బాధపడ్డాను. ఒక వాటా వాడికివ్వాలి. అంటే నా నిధిలో ఒక వాటా తగ్గిపోయినట్లే కదా ! అది కాక వాడు డబ్బాగాడు. వాడు నలుగురిదగ్గరా వాగేడంటే - నిధిమాట దేవుడెరుగు ఇద్దరం జెయిల్లో తేలుతాం. గోడవెంబడి నడుస్తుంటే నాకే ఆలోచన ఆందోళన కలిగించింది.

జేబులోంచి రివాల్వరు తీసి రెమీగియోని ఆపుచేశాను. అంతవరకూ నాదగ్గర రివాల్వరు ఉన్నట్లు వాడికి చెప్పలేదు - 'ఒరే - నోరెత్తావంటే పేల్చిపడేస్తా'

'ఎలిసాండ్రో - నా గురించి ఏమనుకుంటు న్నావు ? - వాడు వణుకుతూ అడిగాడు.

'మారినిస్ నోరు మూయించాలంటే వాడికి కొంత పడెయ్యాలి - అప్పుడు వాడు పోలీసులకి చెప్పడు - చెబితే మనతోపాటు వాడికి కూడా జెయిలే. అంటే నీ వాటాలోంచి కొంత మారినిస్ జేబులోకి పోతుంది - అర్థమవుతోందా ?'

వాడు అర్థమవుతోందన్నాడు. నేను రివాల్వరు జేబులో పెట్టాను. మళ్ళీనడక మొదలుపెట్టాం. కొంచెందిగువ, రోడ్డుకి కుడిపక్కగా ఒక పాత గేటు వుంది. గేటుమీద లాటిన్‌లో ఏదో రాసి వుంది. గేటుకి వేసిన ఆకుపచ్చరంగు వెలిసిపోయింది. తలుపులు విరిగి పోయాయి - ఆ గేటు వెనకాలే మారినిస్ తోట ఉంది రోడ్డుమీద ఎవరైనా ఉన్నారేమో నని అటూ ఇటూ చూసి, ఎవరూ లేకపోవడం గమనించి, తలుపు తీసి లోపలకు అడుగు పెట్టాను. నా వెనకాలే రెమీగియో వచ్చాడు.

నేను కూరగాయలు కొనడానికి రానప్పటికీ వాడితోట నన్ను చాలా ఆకర్షించింది. తిన్నగా తీర్చి దిద్దబడిన నీటి బోదెలు వెన్నెల్లో వెండి తీగల్లా మెరుస్తున్నాయి, బోదుల మధ్య జాగాలో వరుసగా మారినిస్ గుడిసెవరకూ మొక్కలు నాటబడివున్నాయి. అంత చక్కని తోట నేను అంత వరకూ చూడలేదని ఒప్పుకు తీరాలి. మారినిస్ గుడిసె కొంచెం దూరంలో తోట చివర ఉంది. ఇంకా పండని పెద్ద పెద్ద టొమేటోలు ఆకుల చాటునుంచి తొంగి చూస్తున్నాయి. తాటికాయలంత కేబేజీలు, ఉల్లకోళ్ళు, బఠాణి, బీన్స్, లెట్యూస్ - ఒక్కమాటలో చెప్పాలంటే ఆ కాలంలో దొరికే కూరగాయలన్నీ ఉన్నాయి. అక్కడక్కడ దోసకాయలు ఎవరైనా ఏరుకుతీసుకోవచ్చు అన్నట్లున్నాయి. ప్లమ్, పీచ్, ఆపిల్, పియర్, మొదలైన పళ్ళు చెట్లనిండా విరగకాశాయి. ఆతోట చూస్తుంటే ప్రతీ చెట్టునీ, ప్రతీ మొక్కనీ చంటి పాపలా సాకిన తోటమాలి ఆప్యాయత కన్పిస్తుంది. అతను కేవలం లాభాపేక్షతోనే ఇంత శ్రమ పడలేదనిపిస్తుంది.

రెమీగియోగాడి దృష్టి అంతా నిధిమీదే ఉంది. 'మారినిస్ ఎక్కడ?' అనడిగాడు. తోట చివరవున్న గుడిసె చూపించి, 'అక్కడ' అన్నాను. మేం మొక్కల మధ్య నుంచి గుడిసెవేపుకు దారితీశాం. నడుస్తూ నడుస్తూ రెమీగియో లెట్యూస్ మీద కాలు వేశాడు.

'గాడిదా - ఎలా నడుస్తున్నావో చూడు' అని వాడిని మందలించి వాడు తొక్కిపడేసిన మొక్క ఆకువిరిచి నోట్లో వేసుకున్నాను. మంచు లో కడిగినట్లు తాజాగా, తియ్యగా ఉంది.

మేం గుడిసె దగ్గరకు వచ్చాం. మారినిస్ కుక్క నన్ను గుర్తుపట్టి అరవకుండా తోకాడిస్తూ ఎదురొచ్చింది. సాధారణంగా తోటమాలి లందరూ పెంచే పసుపుపచ్చరంగు కుక్క అది - కాని తెలివైంది. నేను మూసిన గుడిసె తలుపులు మెల్లగా తట్టాను. సమాధానం రాకపోతే ఇంకొంచెం గట్టిగా కొట్టాను. అప్పటికీ ఎవరూ రాకపోతే కాళ్ళతో తలుపులు తన్నాను.

'ఎవర్రా అది ? ఏం కావాలి ?'

మారినిస్ గొంతు విని మేం ఎగిరిపడ్డాం. ఆ మాటలు గుడిసెలోంచి రాలేదు. మా వెనకాల పొదల్లోంచి వచ్చాయి. చేతిలో పారతో పొదల్లోంచి మారినిస్ వచ్చాడు. వాడు రాత్రికూడా దెయ్యంలా తోటలో పనిచేస్తూనే ఉన్నాడు. నడుం వంగిపోయి, చేతులు వేళ్ళాడేసి, తెల్లటి గడ్డంతో, ఎర్రటి మొహంతో - రాత్రింబవళ్ళు మొక్కలమయాన పనిచేసే తోటమాలి ఎలావుంటాడో, అలావున్నాడు.

'స్నేహితులం' - నేను సమాధానం ఇచ్చాను.

'నాకు స్నేహితులెవరూ లేరు', అన్నాడు మారినిస్.

వాడుకొంచెం దగ్గరకి వచ్చి పరికించి చూశాడు - 'నువ్వు ......నువ్వు..... ఎరిసాంద్రోవి కదూ'

అవునని తలాడించి జేబులోంచి రివాల్వరు తీసి వాడికేసి గురిచేయకుండా ఊరికే చెత్తోపట్టుకుని అన్నాను - 'మారినిస్ - నిధి ఎక్కడుందో చెప్పేసేయ్ - మనం ముగ్గురం పంచుకుందాం - నువ్వు చెప్పకపోయినా మేమే తవ్వి తీసుకుపోతాం'

అలా మాట్లాడుతూ నేను నా పిస్టల్ పైకి లేపాను. మారినిస్ పిస్టలు అవసరం లేదన్నట్లు పక్కకు తోసేసి, తల వంచి బుర్రగోక్కుంటూ అడిగాడు - 'ఏ నిధి గురించి నువ్వడిగేది?'

'వెండి....... వెండి...... జర్మన్లు దొంగిలించ లేదూ ?

'ఏ జర్మన్లు ?'

'జర్మన్ సైనికులు - ఆక్రమణ సమయంలో - ప్రిన్సు దగ్గర్నుంచి'

'ఏ ప్రిన్స్ ?'

'ప్రిన్స్ - నీకు తెలుసు - నువ్వే చెప్పావు - తోటలో పాతి పెట్టారని '

'ఏ తోట ?'

'నీ తోటలోనే - మారినిస్ - తెలియనట్లు నాటకమాడకు - అది ఎక్కడుందో నీకు తెలుసు - చెప్పు - త్వరగా'

వాడు అలా తలవంచి బుర్ర గోక్కుంటూనే అన్నాడు - 'అది -నిధా - అవును - నిధి......రండి' వాడు తొదరపడుతూ అన్నాడు, 'ఇప్పుడే తవ్వేద్దాం - నీ దగ్గర పార ఉందా ?ఇది తీసుకో - నాకూడా రండి - వాడికి కూడా ఇంకో పార ఇస్తారండి....రండి....'

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వాడు అంత తొందరగా ఒప్పుకుంటాడనుకోలేదు.

'నిధి - ఆహా - ఎంత గొప్పనిధో మీకే తెలుస్తుంది' అని గొణుగుతూ వాడు గుడిసెవెనకాలకు వెళ్ళాడు. ఇంకోపార తీసుకొచ్చి రెమీగియోకి ఇచ్చాడు.

'రండి - నిధికావాలి కదూ - రండి -నిధి - తవ్విస్తా' అలా పాటపాడుతూ దారితీశాడు మారినిస్.

గుడిసె వెనకాల నేలసాగు చెయ్యలేదు. గోతులు, గొప్పులు, చెత్తా చెదారంతో నిండి ఉంది. దూరంగా చెట్ల వరుసవెనుకలో, ముందు వయా ఆరులియావైపు ఉన్నట్లుగానే,




ప్రహరీ గోడ ఉంది. మాకు దారి చూపిస్తూ మారినిస్ చెట్ల వెంబడి తోటచివరి వరకూ, గోడ మూలదాకా పరుగుతీసి, హఠాత్తుగా మాకేసి తిరిగి, అక్కడి నేలను కాలితో తన్నుతూ, 'తవ్వండి - నిధి ఇక్కడే ఉంది' అన్నాడు.

నేను పారతీసుకుని దూకి తవ్వడం మొదలుపెట్టాను. చేతిలో పారపట్టుకుని రెమీగియో నాకేసిచూస్తూనిలబడ్డాడు.

'నువ్వు తవ్వు - ఏరా నీకు వెండి అక్కర్లేదా ?' అన్నాడు మారినిస్.

వెండి మాట చెవిన పడడంతో రెమీగియో గాడు ఎగిరి దూకి, పిచ్చిగా పారతో నేలమీద కొట్టడం మొదలు పెట్టాడు. వాడి తొందర చూసి మారినిస్ అన్నాడు - 'తొందరపడకురా నాయనా - చాలా టైముంది - మెల్లగా '

ఆ మాటలు వింటూ రెమీగియో జోరు తగ్గించి ఈ సారి పార కాలుకేసి కొట్టుకున్నాడు. మారినిస్ వాడి చెతుల్లోంచి పార తీసుకుని ఎలా తవ్వాలో చూపించాడు - 'ఇదిగో - ఇలా పట్టుకోవాలి - పార నేలలో దిగినప్పుడు నీ ఎడం కాలుతో నొక్కిపెట్టాలి - లేకపోతే ఈ జన్మకు గొయ్యి తవ్వలేవు. ఒరేయ్ - రెండుగజాల వెడల్పు గొయ్యి తవ్వండి - నిధికిందే వుంది - ఈ లోగా నేను తోటలో తిరిగొస్తా , ' అన్నాడు మారినిస్


'నువ్వు కదలొద్దు,' అన్నాను.

'భయమెందుకురా - నీకే అన్నాను కదా నిధంతా' అన్నాడు మారినిస్ నేల గట్టిగా, పొడిగా, రాళ్ళతో, వేళ్ళతో, నిండి వుంది. నేను తవ్విన మట్టి ఒకవైపు పొయ్యసాగాను. ముసిలాడు మాత్రం చెయ్యి వెయ్యకుండా, కాళ్ళతో రాళ్ళు అటూ ఇటూ తన్నుతూ మాకు సలహాలివ్వడం మొదలుపెట్టాడు - 'అంత తొందరగా కాదురా.... ఆ వేరు లాగిపడేయ్ .... అదిగో.... ఆ రాయి తీసెయ్....."

చిట్ట చివరకు నల్లటి పొడుగాటి ఎద్దు ఎముక దొరికింది.- 'ఆర్నీ - దొరికిందిరా ఎద్దుఎముక - చూశారా - మెల్లమెల్లగా నిధి బయట పడుతోంది"., అన్నాడు మారినిస్.

వాడు వేళాకోళం ఆడుతున్నాడు, నిజం చెబుతున్నాడో నాకు అంతుబట్టలేదు. రాత్రి చల్లగా ఉన్నప్పటికీ నేను చెమటతో తడిసిపోయాను. రెమీగియో గాడు ఏం చేస్తున్నాడో అని అప్పుడప్పుడు వాడికేసి చూస్తున్నాను. ఒగుతుస్తూ,చకచకా తవ్వి పడేస్తున్న వాడిని చూస్తే నాకు మండు కొచ్చింది. అలా ఒగురుస్తూనే మూడడు గుల లోతు గొయ్యి తవ్వాం. అయినా ఏవీ కన్పించలేదు. నేల తడిగా, బూడిద రంగులో ఉండి, పెళ్ళలు పెళ్ళలుగా ఊడి పడుతోంది. కానీ నిధి ఉన్నపెట్టిగానీ, సంచీకాని, మరేవస్తువూకాని కంటపడలేదు. రెమీగియోగాడిని తవ్వడం ఆపుచెయ్యమని అరిచి గొయ్యిలోంచి బయటికి దూకి మారినిస్‌తో అన్నాను - "ఏయ్ ముసిలాడా - చెప్పు - ఇక్కడ నిధీలేదు గాడిద గుడ్డూలేదు - మమ్మల్ని వెర్రి వెధవల్ని చేసేవింతసేపూ - చెప్పు - నిధి ఎక్కడుంది?"

వాడు నోట్లోంచి పైపు తీసివెంటనే సమాధానం చెప్పాడు - ' నిధి చూపించ మంటారా - సరే - ఇప్పుడే చూపిస్తాను" ఈసారి వాడిని కదలొద్దని నేను ఆపలేదు.




నేనెంత అలసిపోయానంటే నిజం చెప్పాలంటే, ఇప్పుడు నిధి గురించి ఆలోచించే ఓపిక కూడా లేదు. చెట్ల వెనకాల ఉన్న మరో చిన్న గుడిసె ఇంతవరకూ మేం చూడలేదు. మారినిస్ ఆ గుడిసెలోకి వెడుతుంటే చూస్తూ నిల్చున్నాను.

'పారిపోతున్నాడు ముసిలాడు' రెమీగియో అరిచాడు.

'లేదు - పారిపోటంలేదు' - నేను పారమీద ఆనుకుని నుదుట నుంచి కారుతున్న చెమట తుడుచుకుంటూ అన్నాను.

కొన్ని క్షణాల తర్వాత మారినిస్ పెంట నింపిన బండి తోసుకుంటూ వచ్చాడు. మేం త్రవ్విన గొయ్యిలో ఆ పెంట దిమ్మరించాడు. ఒక కాలు గొయ్యిలో పెట్టి, చేతులతో పెంట గొయ్యినిండా సర్దడం మొదలుపెట్టాడు. సందేహిస్తూ అడిగాను, 'సరే - ఇంతకీ నిధిమాటేమిటి ?'

'ఇదే నిధి - ఇదెంత బాగుందో చూడు,' అంటూ ముసిలాడు కంపుకొడుతున్న గుప్పెడు పెంట తీసి నా ముక్కు కింద పెట్టాడు, "చూడు - ఇది బంగారం కాదురా ? మా ఆవు చేసిన పెంట - తస్సాదియ్యా - ఎలాంటి నిధి - ఇలాంటి నిధి నీకు ఎక్కడైనా దొరుకుతుందిరా ? అదీ - అదీ అసలు నిధంటే.........'

మేమున్న సంగతే మర్చి పోయి వాడిలో వాడే మాట్లాడు కుంటున్నాడు. అలా మాట్లాడుతూనే గోతిలోంచి పైకెక్కి, బండి తోసుకుని గుడిసెలో దూరి, మళ్ళీ బండెడు పెంట తీసుకొచ్చి గోతిలో పోసి చదును చెయ్యడం మొదలుపెట్టాడు.

"చూశార్రా - ఇదీ అసలు నిధంటే - చూశారు కదురా, ముసిలాడు అలాగే పాటపాడుతున్నాడు.

నేను రెమీగియో గాడికేసి చూశాను. వాడు నాకేసి చూశాడు. నేను ధైర్యం పుంజుకుని రివాల్వరు బయటికి తీశాను. అదేదో కర్రముక్క అయినట్లు మారినిస్ అవతలకు గెంటిపడేశాడు - 'ఈ పప్పులేం ఉడకవు - నీకు నిజంగా వెండి కావాలంటే ఎక్కడ దొరుకుతుందో చెప్పనా ?"

'ఎక్కడ?' అమాయకంగా అడిగాను

'వెండి దుకాణంలో - వాళ్ళకి వెయ్యిలీర్ల నోట్ల కట్టలు పడేస్తే నువ్వు మోసుకెళ్ళగల్గినంత వెండి పడేస్తారు'.

ముసిలి ముండాకొడుకు ఇంతవరకు మమ్మల్ని ఆట పట్టించాడన్నమాట.

'మరి మాచేత తవ్వించిన ఈ గొయ్యి మాటేమిటి ?' - రెమీగియో నీరసంగా అడిగాడు.

'అదా - అది ఎరువుకిరా - ఏం చెయ్యాలా అనుకుంటే సమయానికి మీరొచ్చి సహాయం చేశార్రా'

నాకు పూర్తిగా నీరసం వచ్చేసింది. వాడిని బెదిరించాలనీ, కాల్చిపడేయాలనీ అనిపించింది. నిధీగిధీ దక్కక గొయ్యి తవ్వి ఒళ్ళు హూనం చేసుకున్న నాకు ఆ ఓపిక లేకపోయింది.

'అంటే నిధీగిధీ ఏవీ లేదన్న మాటేగా?' - కనీసం ఆ ముక్కయినా మారినిస్ ఒప్పుకుంటాడేమోనని ఆశగా అడిగాను. దొంగముండాకొడుకు ఒప్పుకుంటేగా !

'ఉందంటే ఉంది, లేదంటే లేదు,' అన్నాడు

'అంటే'

'ఏదో పగలొచ్చి మర్యాదగా నన్నడిగితే బహుశా నిధి ఉండేదేమో - కాని ఇప్పుడు లేదు' - ఆ మాటలని వాడు మళ్ళీ పెంటకోసం గుడిసెకేసి నడిచాడు. నేను వాడి వెనకాల ఒగర్చుకుంటూ పరిగెట్టి వాడి చొక్కా పట్టుకు లాగి అన్నాను, 'మారినిస్ - నిజం చెప్పు'

మారినిస్ సగం తిరిగి అన్నాడు - 'ఏం? కాల్చవేం ? నీ దగ్గర రివాల్వరు లేదా ?'

'నేను నిన్ను చంపదల్చుకోలేదు - మనిద్దరం చెరిసగం పంచుకుందాం' 'నిజం ఒప్పుకో - నీకు ధైర్యం లేదు - నువ్వు ఎందుకూ పనికిరాని దద్దమ్మవి- ఇంకెవరయినా అయితే నిన్ను కాల్చిపడేసేవారు. జర్మన్లు పిట్టల్ని కాల్చి పడేసినట్లు కాల్చి పడేసేవారు.'

'నేను జర్మన్‌ని కాను'

'నువ్వు జర్మనువి కాపోతే సరే - గుడ్‌నైట్,' ఆ మాటంటూ వాడు గుడిసెలో దూరి నా మొహంమీద తలుపు వేశాడు.

అలా ముగిసింది మా నిధివేట. మర్నాడు మామూలు టైముకి మారినిస్ హోటలులో తయారయ్యాడు. వాడి కోటా లీటరుసారా వాడికి నేనందిస్తుండగా అరిచాడు మారినిస్ - 'ఓయ్ - నిధి, నిధి అంటూ వెంటబడింది నువ్వేకదరా - ఏదీ - నీ పిస్తలేంజేశావు ?'

అదృష్టవశాత్తూ మమ్మల్ని ఎవరూ గమనించలేదు. ఎందుకంటే, ఇంతకుముందే చెప్పినట్లు అవాకులూ చవాకులూ పేలడం మారినిస్ కి అలవాటే. వాడి మాటలు ఎవరూ పట్టించుకోరు. అయినా అక్కడ ఇంకా పనిచెయ్యడం అంత మంచిదనిపించలేదు. అదీకాక రెమీగియో గాడి ముందు నవ్వులపాలవడం నాకిష్టం లేదు. వాడికీ సంగతంతా తెలుసుకదా ఇప్పుడు వాడు అసలు నిధి అంటూ ఉందనే మాట తనెప్పుడూ నమ్మలేదన్నట్లు పళ్ళికిలిస్తున్నాడు. అంచేత అవకాశం చూసుకుని శాన్ కాని మాటోలోని ట్రాన్స్‌వీర్‌లో ఒక రెస్టారెంటులో పనిచెయ్యడానికి వెళ్ళిపోయాను. రెమీగియో మాత్రం శాన్ పాంక్రేజియోలోనే ఉండిపోయాడు.

★